ప్రజాశక్తి
ఆదివారం 16 మార్చి 2025
5
అల్లూరి సీతారామరాజు



పాడేరులో రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయ, ఉత్సవ కమిటీల చైర్మన్, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు పాడేరులో రాష్ట్రస్థాయి మెగా క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.దుర్గారావు, ఎస్.రాంబాబు, బి.మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ టోర్నీ పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామని తెలిపారు. పీస్ బాల్ తో మేట్ పై క్రికెట్ ఆడాల్సి ఉంటుందని, టోర్నీ మేనేజ్మెంట్ వద్ద క్రికెట్ కిట్ లు అందుబాటులో ఉంటాయన్నారు. సుమారు నెలరోజుల పాటు ఏకధాటిగా నాకౌట్ పద్ధతిలో టోర్నీ నిర్వహిస్తామన్నారు. 3వేలు ఎంట్రీ ఫీజుతో మార్చి 20వ తేదీ లోగా జట్టు పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ రూ.1.20 లక్షలు, ద్వితీయ రూ.60వేలు, ట్రోఫితో పాటు బెస్ట్ టీమ్ కు రూ.20వేలు, మ్యాన్ ఆఫ్ ద సిరిస్ రూ.15వేలు, వ్యక్తిగత విభాగంలో ఒక్కొక్క విభాగానికి రూ.5వేలతో పాటు ట్రోఫీలను అందజేస్తా మన్నారు. వివరాలకు 8919854104, 6302694492 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పింఛన్లు మంజూరు చేయాలి

-కొత్తవి ఇవ్వడంలో జాప్యమేలా ? - జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్‌పిటిసిలు డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఉమ్మడి విశాఖ జిల్లాలో అర్హత కలిగిన వారందరికీ కొత్త సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని పలువురు జెడ్‌పిటిసిలు డిమాండ్ చేశారు. ముఖ్యంగా వితంతు పింఛన్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త పింఛన్ల మంజూరుకు వెంటనే చర్యలు చేపట్టాలని పట్టుబట్టారు. శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్‌లో 1 నుంచి 7 వరకూ గల స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కొత్త పింఛన్లు మంజూరుపై ప్రస్తావన వచ్చింది. దీనికి డిఆర్‌డిఎ ప్రభుత్వానికి ఈసరికే నివేదికలు పంపిందని, మంజూరైన వెంటనే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. దేవరాపల్లి జెడ్‌పిటిసి సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ గొర్రెలు, మేకల మీద ప్రభుత్వం అమలు జరుపుతున్న స్కీములను తెలియజేయాలన్నారు. వాటికి



హాజరైన జెడ్‌పిటిసిలు

చైర్‌పర్సన్ సుభద్ర బదులిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా గ్రామీణ ప్రాంతంలో అర్హులైన పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం మంజూరు చేయాలని, పక్కా గహాలు ఇవ్వాలని కొందరు సభ్యులు కోరారు. దీనికి హౌసింగ్ శాఖ అధికారులు బదులిస్తూ ప్రస్తుతం సర్వేలు జరుగుతున్నాయని, సర్వే పూర్తయిన వెంటనే లబ్ధిదారులను గుర్తిస్తామని తెలిపారు. కెజిహెచ్‌లో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణలో జాప్యం జరుగుతోందని చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రస్తావించగా కెజిహెచ్ నుంచి హాజరైన ప్రతినిధి మాట్లాడుతూ పోస్టు మార్టం చేయాలంటే పోలీసు శాఖ వారు పంచనామా చేయాల్సి ఉంటుందని, తదుపరి మాత్రమే పోస్టుమార్టం చేయగలమని చెప్పారు. పంచనామా ఆలస్యంతో పోస్టుమార్టంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజల కోసం కెజిహెచ్‌లో ప్రత్యేకంగా వెయిటింగ్ హాలు నిర్మించామని, అన్ని సదుపాయాలూ ఉన్నాయని, గిరిజన ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్లపై సర్వేలు జరుగుతున్నాయని తెలియజేశారు. అరకు జెడ్‌పిటిసి శెట్టి రోషిని మాట్లాడుతూ కెజిహెచ్‌లో పేషెంట్ల హెల్త్ రికార్డు వివరాలు తెలుసుకోవడానికి హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. దీనికి కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద బదులిస్తూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ అప్డేట్ అవుతోందని, త్వరలోనే అవుట్ పేషెంట్‌ను ప్రతిరోజు చూసే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

ఏజెన్సీలో అంబులెన్స్‌ల సమస్యలు

అరకు జెడ్‌పిటిసి రోషిని మాట్లాడుతూ తమ ప్రాంతంలో 108 అంబులెన్సులు సకాలంలో స్పందించటం లేదని, అందువల్ల గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన పాడేరు మండలంలో 108 సౌకర్యం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇది తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐదో స్థాయి సంఘం చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం శాఖాపరంగా ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నాయని, వాటిపై వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోటవురట్ల మండలం పందూరు సమీపంలో సిపిడబ్ల్యుఎస్ పథకానికి దగ్గరలో ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయని, అందువల్ల ఈ స్కీము ఎండిపోయే ప్రమాదం ఉందని, అనేక గ్రామాలకు మంచినీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు కలిగే వీలుందని కోటవురట్ల జెడ్‌పిటిసి తెలిపారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అనకాపల్లి ఆర్ఇసిఎస్‌ను ఇపిడిసిఎల్‌లో విలీనం చేసిన తర్వాత సిబ్బంది నుంచి బయోమెట్రిక్ విధానం అమలు చేయడం లేదన్నారు. అందువల్ల పలువురు ఉద్యోగులు విధులకు హాజరుకాకుండానే జీతాలు తీసుకుంటున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఎపిడిసిఎల్ డైరెక్టర్‌ను కోరారు. ఈ సమావేశాల్లో మూడు జిల్లాల జెడ్‌పిటిసిలు, జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పి పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి సమావేశాలను నిర్వహించారు.



పిడిఎఫ్ లిస్టుపై అధికారులను నిలదీస్తున్న బాధితులు

పిడిఎఫ్ లిస్ట్‌పై నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి మండల కేంద్రంలో పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శనివారం నిర్వహించిన గ్రామసభలో పిడిఎఫ్ లిస్టుపై నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదల చేసిన పిడిఎఫ్ లిస్టులో పెండింగ్‌లో ఉన్న సుమారు 300 మంది నిర్వాసితులు అధికారులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బాధితులను సముదాయించే క్రమంలో ఇది కేవలం భూ సేకరణకు మాత్రమే ఏర్పాటు చేసిన గ్రామసభ అని, ఎక్కడ కాలనీలు నిర్మించాలో మీరే నిర్ణయించుకొని తీర్మానం చేసి లిఖితపూర్వకంగా తెలియజేస్తే ఆర్ అండ్ ఆర్ కాలనీలు కట్టే వీలుంటుందని చెప్పారు. ఇటీవల విడుదలైన పిడిఎఫ్ లిస్టు అధికారమైనది కాదని, దీనిపై ఎవరూ ఆందోళన పడవద్దని, మరో కచ్చితమైన పూర్తి సమాచారంతో నిర్వాసితుల లిస్టు వారం రోజుల్లో అందజేస్తామని తెలిపారు.

గతంలో తాడువాయి, యాదవోలు ప్రాంతాల్లో పునరావాసం ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా బస్సుల్లో నిర్వాసితులను పరిశీలనకు పంపారు. అయితే యాదవోలులో గ్యాస్ పైప్, తాడ్వాయిలో ఆయిల్ పైపు లైన్లు ఉన్నాయని, ప్రమాదకరమైన ఈ ప్రాంతాలు తమకు వద్దని నిర్వాసితులు అధికారులకు తెలియజేశారు. ఆపై తూర్పుగోదావరి జిల్లా గోకవరం వద్ద కృష్ణునిపాలెంలో ప్రభుత్వ స్థలం ఉందని, దానిని కేటాయించాలని నిర్వాసితులు పోలవరం ప్రాజెక్టు అధికారులను కోరారు. అయితే కృష్ణునిపాలెం రైతులు ప్రభుత్వానికి తమ భూములు అమ్మటం జరగదని, నేరుగా నిర్వాసితులు కొనుగోలు చేస్తే విక్రయిస్తామని స్పష్టం చేశారు. దానికి గాను చింతూరు పిడిఎఫ్ కమిటీ సభ్యులు సమావేశమై పునరావాస ప్రాంతాన్ని సందర్శించేందుకు మరికొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినందుకు సమావేశం ఏర్పాటు చేసుకొని విషయాన్ని తెలియజేస్తామని పోలవరం ఎస్‌డిసి అధికారులకు పిడిఎఫ్ కమిటీ తెలియజేసింది. గిరిజనులకు భూమికి భూమి ఇచ్చే దగ్గరలో పునరావాసం కల్పించాలని, నివాసం ఒకచోట వ్యవసాయ భూమి మరోచోట కేటాయిస్తే ఇబ్బందులకు గురవుతారని, ఒకే చోట భూమి, నివాసం ఉండేలా భూసేకరణ కోసం ప్రయత్నాలు సాగుతున్నాయని, త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందని అధికారులు గ్రామసభలో తెలియజేశారు. ఈ సభలో స్పెషల్ డిప్యూటీ పోలవరం కలెక్టర్ ఎం చంద్రశేఖర్, ఎంపిడివో, ఎమ్మార్వో చిరంజీవి, విఆర్ఓ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సిపిఎం నేత శరభన్నకు కన్నీటి వీడ్కోలు

- తరలి వచ్చిన పలు పార్టీల నేతలు, గిరిజనులు



పాడె మోస్తున్న అప్పలనర్స, గంగరాజు, నాయకులు

ప్రజాశక్తి-పెదబయలు : గిరిజన ఉద్యమ నేత, సిపిఎం పెదబయలు మండల నాయకులు కిల్లో శరభన్న అంత్యక్రియకులు నాయకులు, ప్రజలు తరలి వచ్చారు. అనారోగ్యం తో మృతి చెందిన విషయం తెలిసిందే. శరభన్న అంతిమ యాత్రలో సిపిఎం మండల కార్యదర్శి సన్నిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బ శరబన్న మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో అడుగుల పుట్టు పంచాయతీ వడ్డెపుట్టు గ్రామంలో శనివారం శరభన్న



శరభన్న పార్థివ దేహాన్ని చూసేందుకు భారీగా తరలి వచ్చిన గిరిజనులు

అంతిమ యాత్రకు భారీగా తరలి వచ్చి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి, అప్పల నర్స మాట్లాడుతూ పెదబయలు మండలంలో గిరిజనుల సమస్యల పట్ల గత 15 సంవత్సరాలు ఆదివాసులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు నిర్వహించారని కొనియారు. ఆయన మృతి గిరిజన ఉద్యమానికి, సిపిఎం పార్టీకి తీరని లోటని అన్నారు. గిరిజన సమస్యల పట్ల అనేక పోరాటాలు చేసిన ఘనత శరభన్నకి దక్కిందన్నారు, గిరిజనులకు పోడు భూమి పట్టాలు, గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మంచినీరు సౌకర్యం కల్పించాలని, పి,వి, టీ,జీలకు అంత్యోదయ కార్డులు, మారుమూల ప్రాంతాల్లో రహదారి సౌకర్యం కల్పించాలని, పి వి టి జి లకు 30 కేజీలు బియ్యం ఇవ్వాలని అనేక పోరాటాలు నిర్వహించారన్నారు.అరకు, డుంబ్రిగుడ, పాడేరు, ముంచింగి పుట్టు సిపిఎం నాయకులు మృత దేహానికి నివాళులు అర్పించారు. సన్నిబాబు మాట్లాడుతూ, ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అనంతగిరి జడ్పీటీసీ గంగరాజు, సన్నిబాబు, ఉమామహేశ్వర్‌రావు, హైమావతి, పాలికి లక్కు, లింగరి సుందర్రావు, సాగిన ధర్మన్న పడల్, బాలదేవ్ నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ జర్సింగి సూర్యనారాయణ, అప్పారావు బిజెపి నాయకులు పాంగి రామయ్య, మాజీ ఎంపిటీసీ లు సర్పంచులు అంతిమ

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ హెచ్చరిక

ప్రజాశక్తి -పాడేరు : ఈనెల 17 వ తేదీ నుండి జరగనున్న పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయం నుండి పది పరీక్షల ఏర్పాట్లపై విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, రవాణా, పబ్లిక్ ట్రాన్స్పోర్టు, విద్యుత్, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాస్ కాపీయింగ్ జరిగితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాస్ శాతాన్ని పెంచడానికి మాస్ కాపీయింగ్ జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పరీక్షలు సజావుగా జరగడానికి మండల విద్యాశాఖాధికారులు బాధ్యత వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీటి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, తగినన్ని మందులను సమకూర్చుకోవాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో 71 పరీక్షా కేంద్రాలో 20 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ సెట్ 1,సెట్ 2 పరీక్షా పత్రాలు జిల్లాకు చేరాయన్నారు. ఈ సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఎల్.రజని, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, ట్రాన్కో ఎస్.ఇ. ప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి సోమవారం గ్రీవెన్స్

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని తహసిల్దార్ జయప్రకాష్ పత్రిక ప్రకటనలో శనివారం పేర్కొన్నారు. జిల్లా కలెక్టరు ఉత్తర్వుల మేరకు గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పట్టా డివైడ్, రీ సర్వే, అధికంగా భూమి నమోదు కావడం, భూ సమస్యలపై ఫిర్యాదులు పెట్టుకోవచ్చు అన్నారు. గ్రామంలో డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి సమస్య తదితర సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

ప్రజాశక్తి డుంబ్రిగుడ:- యుక్త వయస్సులోనే నాణ్యతతో కూడిన సంపూర్ణమైన పౌష్టిక ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక ఐసిడిఎస్ సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని కిల్లోగుడ ఇంగ్లీష్ మీడియం బాలికల ఆశ్రమ పాఠశాలలో కిషోర వికాసం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం పోషకాహారం, ఉన్నత చదువులపై అవగాహన కల్పించారు. కిల్లోగుడ అంగన్వాడీ కేంద్రంలో ఆ పంచాయతీ సర్పంచి తౌడమ్మ సమక్షంలో స్వచ్ఛత హీ సేవా, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ప్రధానోపాధ్యాయిని కళావతి, ఉపాధ్యాయుడు రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీసా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పీసా నూతన మండల కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. పెసా మండల అధ్యక్షుడుగా చప్పలి శంకర్‌రావు, ఉపాధ్యక్షులుగా సాగోరి అప్పలకొండ, ప్రధాన కార్యదర్శిగా జన్ని వెంకట రమణ, జాయింట్ సెక్రెటరీగా చెట్టి జయరాం కుమార్, కోశాధికారిగా పాడి భరత్ కుమార్ ఎన్నియ్యారు.



ఎన్నికైన నూతన సభ్యులు

ఉత్సాహంగా ప్రజా చైతన్య యాత్రలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

ప్రజల నుండి సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయడానికి సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో జరుగుతున్నాయి.

హుకుంపేట : సమస్యలను పరిష్కారం చేయాలని సీపీఎం మండల నాయకులు తమర్బ అప్పలకొండ పడాల్, గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపులా క్రిష్ణారావు ఆధ్వర్యంలో బారామసి సచివాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన ప్రజా సమస్య లపై ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఇల్లు, పోడు భూమి పట్టాలు, రేషన్ కార్డులు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు ఇతర సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీఆర్ఓ, సెక్రెటరీలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సన్యాసమ్మపాలెం వార్డ్ మెంబర్, సీపీఎం మండల నాయకులు కొర్ర అప్పారావు, సన్యాసమ్మపాలేం పెసా ఉపాధ్యక్షుడు కొండబాబు, నాయకులు ముదిలి కైలాష్, కించేయి భీమన్న పాల్గొన్నారు.

అరకులోయ రూరల్ : మండలంలోని బొండం పంచాయితీ కొత్తవలస గ్రామంలో ప్రజా



అనంతగిరి మండలం పెదబిడ్డ పంచాయతీలో సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

చైతన్య యాత్ర లో భాగంగా శనివారం సిపిఎం నేతలు పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు గత్తుం బుజ్జి బాబు, టి.జోషి మాట్లాడుతూ, కొత్తవలస గ్రామంలో కొండ పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు అభ్యంతరం తెలపడంతో పట్టాలు పంపిణి నిలిపివేశారన్నారు. గిరిజనులకు ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలతో బొండం గ్రామ సచివాలయనికి వెళ్లె రోడ్డు పనులు అసంపూర్తిగా మధ్య లోనే పనులు ఆగిపోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి వెంకట్,రమణ, గ్రామస్తులు జి.శంకర్, టి.చిన్నమ్మి, టి.లక్ష్మి, జి.శాంతి, ప్రియ, జి.నీలమ్మ, శివ పాల్గొన్నారు.

అనంతగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కిల్లో. మొస్య డిమాండ్ చేశారు, ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శనివారం పెదబిడ్డ పంచాయతీ పరిధి కంటిపురం, మెడపర్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మొస్య, నాగులు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కూడా ఆదాని నవయుగ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకుని కట్టబట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు వి.బుద్రయ్య, కార్యకర్తలు గిరిజనులు పాల్గొన్నారు

కొయ్యూరు : సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య యాత్ర మండలంలోని పలు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు సూరిబాబు మాట్లాడుతూ అధికారులు స్పందించి ఉసిరికపాడుకు రోడ్లు వెంటనే వేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సోమయ్య, సన్యాసిరావు, అచ్చిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



హుకుంపేట మండలం బారమసి సచివాలయం వద్ద వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

మండుతున్న ఎండలు

సీలేరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ప్రజాశక్తి-సీలేరు

మార్చి రెండో నెల మధ్యలోనే ఎండలు మండుతున్నాయి. భానుడి ప్రతావంతో జీకే వీధి మండలం సీలేరులో శనివారం మధ్యాహ్నం 40 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 గంటల నుంచి సూర్యుడు నిప్పులు కక్కుతూ తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు ఎండ వేడికి తాళలేక అనేక అవస్థలు పడ్డారు. శనివారం నాటి ఎండకు ప్రజలు ఇండ్లలోంచి బయటికి వచ్చేందుకు సాహసించలేదు. ఏసీలుకు, కూలర్లకు పరిమితమయ్యారు. గురువారం 36 డిగ్రీలు, శుక్రవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా శనివారం ఉదయం 11 గంటలకి 34, ఒంటిగంటకు 36 డిగ్రీలు నమోదు కాగా, మధ్యాహ్నం 2.33 గంటలకు 40 డిగ్రీలకు చేరుకుంది. వేడితో పాటు ఉక్క పోత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఎండ వేడి తాళ లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. గతేడాది మార్చి నెలలో 36, 38 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది ఇప్పుడు 40 డిగ్రీలు చేరుకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.



శక్తి టీమ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా

మహిళలపై వేధింపులను అరికట్టేందుకు శక్తి టీమ్స్

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేశామని చింతూరు అడిషనల్ ఎస్‌పి పంకజ్ కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన శక్తి టీమ్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శక్తి టీమ్స్‌ను జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్ళను మఫ్టీలో నిఘా పెడతామన్నారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు ఈ టీమ్స్ తీసుకుంటాయని చెప్పారు. అదనపు ఎస్పీ నోడల్ అధికారిగా ఉన్న ఈ టీమ్స్‌లో మహిళా ఎస్ఐ నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, నలుగురు కానిస్టేబుళ్లు ఏడుగురు సభ్యులు ఉంటారని పేర్కొన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తాయని, ఆపద సమయంలో శక్తి యాప్‌నకు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్‌తో సంఘటన స్థలానికి ఈ టీమ్ వెళ్తాయని చెప్పారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించేలా సూచనలు చేశామన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించేలా టీమ్స్ తెలియజేశామని తెలిపారు. ప్రతి మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అంగన్వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని రాజవొమ్మంగి జడ్పిటిసి ఒడుగుల జ్యోతి డిమాండ్ చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో శనివారం జరిగిన జిల్లా పరిషత్ బడ్జెట్ , సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజవొమ్మంగి మండలంలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారని తెలిపారు. 10 సంవత్సరాల క్రితం కొన్ని గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలు మంజూరైనా నేటికీ చాలాచోట్ల పునాది స్టేజ్‌లోనే ఉన్నాయని, కొన్నిచోట్ల గోడల నిర్మించి ఉన్నాయని, మరికొన్ని చోట్ల స్లాబులు వేసి ప్లాస్టింగ్ చేసి ఉన్నాయని తెలిపారు. ఈ పాత వర్కులన్నీ పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, లేనిచోట్ల కొత్త భవనాలను మంజూరు చేయాలని కోరారు. దీనికి రంపచోడవరం ప్రాజెక్ట్ అధికారి స్పందించి భవనాలన్నీ పూర్తయ్యే విధంగా ఆదేశాలు ఇస్తామని తెలిపారు.



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి

వార్డెన్, ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

- విద్యార్థి మృతి ఘటనలో అధికారుల చర్యలు



మాట్లాడుతున్న పాడేరు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల 2లో చదువుతున్న విద్యార్థి పాంగి యోసేపు బావిలో పడి మృతి చెందిన మృతి చెందటంతో కుటుంబీలు ఆందోళన చేపపట్టారు. విషయం తెలుసుకున్న పాడేరు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని స్థానిక ఏటిడబ్ల్యూఓ జయ నాగలక్ష్మి తో కలిసి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ ఘటనలో వసతి గృహ వార్డెన్, వ్యాయామ ఉపాధ్యాయుడు (పిడి) మరో ఉపాధ్యాయుని సస్పెండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకుడు జీవన్ కృష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సాగిన చిరంజీవి పడాల్, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, వైకాపా నాయకుడు మాజీ వైస్ ఎంపీపీ భూసారీ కృష్ణారావు లు మృతదేహం తో పాఠశాల గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టడంతో అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు పాడేరు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని పర్యటించారు. విద్యార్థి మృతికి కారణాలను వసతి గృహ వార్డెన్ ఉగ్రంగి గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పలసి పండన్న లను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్, వ్యాయామ ఉపాధ్యాయుడు (పిడి) అప్పన్న, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సతీష్ కుమార్‌లను కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యా యుడు పండన్న పై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆందోళనకారులకు హామీ ఇచ్చారు. స్థానిక ఏఎస్పి నవజ్యోతి మిశ్రా, సీఐ వినోద్ బాబు, ఎస్సై వెంకటేశ్వరరావు మృతదేహాన్ని చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. శనివారం పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నకిలీ సరుకులపై అప్రమత్తత

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: నకిలీ నిత్యావసరాల సరుకుల విక్రయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ సంయుక్తంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంతలలో విక్రయించే నాసిరకం ఆహార పదార్థాలు, స్థానికంగా తయారు చేసే శీతల పానీయాలు, ఎఫ్ ఎస్ ఐ ఆమోదించని ఆహార పాకెట్స్‌పై సర్వే నిర్వహించామని తెలిపారు. వినియోగదారులు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. వినియోగదారులకు నష్టం జరిగితే సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన వస్తువు నిర్దేశించిన ప్రమాణాల్లో ఏమైనా లోపం ఉంటే వారికి ప్రశ్నించే హక్కు ఈ చట్టం ద్వారా ఏర్పడిందని పేర్కొన్నారు. ఆర్గానిక్ జిల్లాగా మార్చడానికి తగు చర్యలు చేపడుతునామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బి. గణేష్ కుమార్, డిఆర్ఓ కె.పద్మలత, జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు ఫోరం బి.చిట్టిబాబు, జిల్లా వినియోగదారుల సలహాదారుడు పి.చిట్టిబాబు, జనరల్ సెక్రటరీ కె.రమేష్, డిసిపిసి మెంబెర్ పి.శివప్రసాద్, విద్యార్థులు, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల తరలింపునకు చర్యలు

పాడేరు: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించడానికి సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన కార్యాలయం నుండి పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి, చింతూరు ఐటిడి ఏ పిఒ, రహదారులు భవనాలు, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పునరావాస కాలనీల్లో తాగునీరు, విద్యుత్తు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. భూములు కోల్పోయిన రైతులకు సకాలంలో పరిహారం, ప్రత్యామ్నాయ భూములు అందించడానికి తగిన భూములను గుర్తించాలని పేర్కొన్నారు. రైతులకు మెట్ట, పల్లపు భూములలో ఏది కావాలంటే అటువంటి భూములను గుర్తించి రైతులకు అందించాలని చెప్పారు. భూ సేకరణ, పునరావాస కల్పన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేసారు. పునరావాస కాలనీలలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి నిర్వాసితుల తరలింపునకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం చింతూరు ఐటిడిఏ పిఓ అపూర్వ భరత్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్



శక్తి టీమ్‌ను ప్రారంభిస్తున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఉత్తరాల మేరకు పాడేరు సబ్ డివిజన్ శక్తి టీం ను శనివారం అరకులోయలో పాడేరు డీఎస్పీ షేక్ షాహబాజ్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, మహిళలందరూ శక్తి యాప్‌ను తమ మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. మహిళలకు ఏమైనా ఇబ్బంది కలిగినప్పుడు పోలీస్ కంట్రోల్ రూమ్ ను సంప్రదిస్తే వెంటనే శక్తి టీము ఆ ప్రదేశానికి వెళ్లి రక్షణ చేపడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరకు సిఐ హిమగిరి, ఎస్ఐ గోపాల్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు పట్టణంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గ్లకోమా వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అందత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ, 40 సంవత్సరాల వయసు దాటిన ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం తప్పని సరిగా ప్రత్యేకంగా డయాబెటిక్, రక్తపోటు ఉన్న వారు కంటిపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధి ముందుగా గుర్తించి మందులు వాడితే కంటి చూపును కోల్పోకుండా నివారించ వచ్చునని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించు కోవాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో డిపిఎం, డిబిసిఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ ద్వితీయ ఏడాది పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రంలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. శనివారం ముగిసిన ఇంటర్ ద్వితీయ ఏడాది పరీక్షలో 179 మందికి గాను 178 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ పూర్ణేశ్వరరావు తెలిపారు.

ఇఫ్తార్.. ఆత్మీయతకు ప్రతీక

ప్రజాశక్తి- గాజువాక: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు పాటించే ముస్లిముల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారంగాజువాక కణితి రోడ్డులోని మదీనా మసీదు వద్ద మదీన యూత్ ఆధ్వర్యంలో ప్రార్థనల్లో పాల్గొని, ఇఫ్తార్ విందు స్వీకరించారు. ముస్లిములకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక సిఐ పార్థసారథి, మైనార్టీ నాయకులు ఐహెచ్ ఫారుఖీ, ముస్లిం పెద్దలు రజీవుల్లా, షౌకత్ అలీ, ఆరిఫ్, పీర్ బాబా, మునవర్, మిస్కిన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

-పలుచోట్ల స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర



పాడేరులో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సామాజ ఆరోగ్యానికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పౌరులందరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక అంబేద్కర్ కూడలి నుండి ర్యాలీ ప్రారంభించారు. అంబేద్కర్ కూడలి నుండి జూనియర్ కళాశాల మైదానం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందాలంటే పారిశుధ్యం మెరుగుపడాలన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామాలను, వార్డులను దత్తత తీసుకోవాలని సూచించారు.
మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన ఇస్తోందన్నారు. మే 11,12.13 తేదీలలో మోదకొండమ్మ అమ్మవారి జాతర జరగబోతుందన్నారు.ఐటీడీఏ ఏవో హేమలత, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి ఎస్. కుమార్, డిఆర్‌ఏ పిడి వి.మురళి, తహశీల్దార్ వంజంగి త్రినాధరావు నాయుడు, ఎంపిడిఓ జె. తేజ రతన్, ఈ ఓ పి ఆర్డి రమేష్, బొర్రా నాగరాజు, బొర్రా విజయరాణి, ఉప సర్పంచ్ రాము కొట్టగుళ్లి సుబ్బారావు, రెడ్ క్రాస్ ప్రతినిధి ఎస్.గంగరాజు పాల్గొన్నారు.
ప్రతీ నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగంగా కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేసారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలత మొక్కలు నాటారు. సర్వే సహాయ సంచాయలకులు దేవేంద్రుడు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణానికి ఐక్యంగా కలిసి పని చేస్తేనే 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన సాధ్యమవుతుందని ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర అన్నారు. అరకులోయ మండలంలోని 14 గ్రామ పంచాయతీలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీలో చేపట్టిన కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి సియ్యారి దొన్ను దొర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.లవరాజు, పద్మాపురం సర్పంచ్ పెట్టెలి సుస్మిత, టీడీపీ మండల అధ్యక్షుడు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ పి దాసు బాబు, మాజీ సర్పంచ్ లోకోయి మహాదేవ్, వార్డు మెంబర్లు త్రినాధ్, నాగరాజు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ గన్నేరు పుట్టు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ శాంత కుమారి మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రం గా ఉంచుకోవాలనీ, తడి పొడి చెత్తను వేరు వేరుగా ఉంచాలన్నారు. గ్రామం లో అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్య కొండ బాబు, పంచాయతీ ఉప సర్పంచ్ అల్లంగి సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి శివకృష్ణ పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని చేపట్టారు. మండల కేంద్రంలో ఎంపీడీవో. కుమార్, తహసిల్దార్ మాణిక్యం సిబ్బందితో కలిసి పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగానికి అందరు స్వస్తి పలకాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 1 తారీఖు నుండి అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజలు భాగస్వామ్యంతో దశలు వారీగా ప్లాస్టిక్ నిషేదానికి జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వ్యాపారులతో 'సే నో టూ ప్లాస్టిక్' అనే అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సార్ల లలిత కుమారి, వైస్ ఎంపిపి లక్కోండ రవి కుమార్, మండల ప్రత్యేకాధికారి చైతన్య, తహశీల్దారు బాలాజీ, మండల టీడీపీ అధ్యక్షులు శేషకుమార్, ఎంఇఒ బి.ముత్యాలరావు, విస్తరణ అధికారి పెయ్యల విజయకుమారి, పరిపాలన అధికారి రత్నకుమారి పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలో ప్లాస్టిక్‌ను నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని ఎంపీడీవో పిలుపునిచ్చారు. మండలంలోని రేకపల్లి జంక్షన్ వద్ద జరిగిన స్వచ్ఛ దివాస్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు సరస్వతి ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో వినోద్, సెక్రెటరీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని నడింపాలెం పంచాయితీలో పంచాయితీ ఇంచార్జి కార్యదర్శి రమణ ఆధ్వర్యాన స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ చేసి మూడు రోడ్ల కూడలిలో మానవహారం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాము, జంపా వెంకటరమణ, రమాదేవి, సింహాచలం, కృష్ణ పాల్గొన్నారు.

కూనవరం : ప్లాస్టిక్ కవర్లు వద్దు క్లాత్ సంచులు ముద్దు అని కూనవరం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక పాత బస్ స్టాండ్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ హేమంత్ కుమార్, వైస్ ఎంపీపీ సాంబశివ రావు, ఎంపిడిఓ రామాంజనేయ ప్రసాద్, ఎస్ఐ లతాశ్రీ, కార్యదర్శి సురేష్, వీఆర్వో వెంకన్న, ఏ.పి.ఓ శ్రీకాంత్, హెచ్ఎం అప్పారావు పాల్గొన్నారు.

అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో శనివారం సచివాలయం సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమం ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయ, స్థానిక సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, వైస్ సర్పంచ్ ముప్పనశెట్టి శ్రీను, ఎంఇఒ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : జికె.వీధి మండల కేంద్రంలో ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇఓపిఆర్డి పాపారావు, ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీటీసీలు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జికె వీధి మండలం సీలేరులో పంచాయతీ కార్యదర్శి పరశురాం, సర్పంచ్ దుర్గో ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ సెంటరులో శ్రమదానం చేసి, ప్రతిజ్ఞ చేశారు. సీలేరు అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సింహాచలం పడాల్ సెక్షన్ ఆఫీసర్ సతీష్ ఆధ్వర్యంలో కలప డిపోలో చెత్తాచెదారాల్ని తొలగించి పరిశుభ్రం చేసి నిప్పు పెట్టారు. సీలేరు లో ఏపీ జెన్కో విద్యుత్ ఉద్యోగులు జెన్కో కార్యాలయాలు, కాలనీ పరిసరాల్లో చెత్తాచెదారాలు తొలగించి పరిశుభ్రపరిచారు.

రాజవొమ్మంగి : పర్యావరణానికి చేటు కలిగించే ప్లాస్టిక్‌ని నిర్మూలించడం అందరి బాధ్యత అని డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి బి అంబేద్కర్ అన్నారు. శనివారం రాజవొమ్మంగి గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ గొల్లపూడి రమణి అధ్యక్షతన అధికారులు స్థానిక వర్తకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి ప్లాస్టిక్ నిషేధం కోసం, స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఏ.సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంఈఓ సత్యనారాయణ దొర, సిడిపిఓ దేవమణి, ఏపీఓ రెడ్డి బాబు, ఏపీఎం రామాంజనేయులు, ఎంపీటీసీలు గొల్లపూడి పెద్దిరాజు, కనిగిరి గంగాదుర్గ, వీరబాబు పాల్గొన్నారు.



అడ్డతీగలలో నిర్వహిస్తున్న ర్యాలీ



రాజవొమ్మంగిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆదివాసీ మహిళలకు 'గీతం' స్వయం ఉపాధి శిక్షణ



ఆకులతో ప్లేట్ల తయారీ శిక్షణలో ఆదివాసీ మహిళలు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువేలిలో వివిధ గ్రామాల ఆదివాసీ మహిళలకు స్వయంఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. గీతం బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు షీలా, డాక్టర్ కృష్ణ కుమారి, డాక్టర్ శ్రీలలిత సాగి పాల్గొని మహిళలకు స్థానికంగా లభించే ఆకులతో ప్లేట్లు, ఇతర సామగ్రి తయారీపై నైపుణ్య శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ షీలా మాట్లాడుతూ, ఆదివాసీ మహిళలకు విలువైన వ్యాపార నైపుణ్యాలను నేర్పించడంతో పాటు, వారికి స్థిరమైన ఆదాయాన్ని సంపాదించడానికి, వారి జీవన ఉపాధిని మెరుగుపర్చడానికి శిక్షణ ఉపకరిస్తుందన్నారు. శిక్షణ అనంతరం స్థానిక మహిళలు తక్షణమే ఉత్పత్తులు తయారు చేయడానికి వీలుగా హత్తాగూడ, తురైగూడ, కరైగూడ, చినాలుగూడ గ్రామాల మహిళలకు ఆకులతో ప్లేట్లు తయారు చేసే యంత్రాన్ని అందించారు. టొయోట్స్ రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ యంత్రాన్ని సిఎస్ఆర్ నిధులతో సమకూర్చింది. సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ మురళీధరరావు మాట్లాడుతూ, ఆదివాసీ మహిళల ఉపాధికి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, వ్యాపార కార్యక్రమాలను సులభతరం చేయడానికి ఈ యంత్రం ఉపకరిస్తుందన్నారు. గీతం బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ సభ్యుల కృషిని అభినందించారు.

ఉక్కుపై సాగుతున్న కూటమి మోసం..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండి' అన్న సామెతను గుర్తుకు తెచ్చేలాగ కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన వ్యవహారం 'ఉక్కు' విషయంలో ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. రూ.11440 కోట్లును ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చేశాం, ఇంకేం కావాలంటూ చెప్పిన మాటలు ఉత్తివేనని తెలుసుకోవడానికి కార్మికవర్గానికి ఎంతోసేపు పట్టలేదు. ప్యాకేజీ విషయంలో కేంద్రం మార్గదర్శకాలు దారుణంగా ఉన్నాయి. ప్యాకేజీ డబ్బుతో ప్లాంట్ మెయింటినెన్స్ పనులు చేయకూడదు. రా మెటీరియల్ కొనడం, కార్మికుల జీతాలకు వినియోగించడం చేయరాదు. దీంతో అసలు మోసం ఏమిటో బట్టబయలైంది. ఈ ప్యాకేజీతో సమస్య మొత్తాన్ని పరిష్కరించేశాం అన్న రీతిలో టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గొప్పగా ప్రచారం చేసుకుంటూ రాష్ట్రంలో ఆయా పార్టీల శ్రేణులతో సంబరాలు చేయించారు. 2024 సాధారణ ఎన్నికలకు ముందు 'విశాఖ స్టీల్' రాజకీయ రంగంలో పెద్ద అజెండా అయి ఎన్నికల సభల్లో టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి నేతలు హామీల వర్షం గుప్పించారు. తాము గెలిస్తే ప్లాంట్‌ను రక్షించి తీరుతామని, ప్రైవేటీకరణ ఆపుతామని పెద్ద పెద్దమాటలు వల్లెవేశారు. ప్రజాగళం పేరుతో టిడిపి, జనసేన విడుదల చేసిన ఉమ్మడి మ్యానిఫెస్టోలోనూ ఆ విషయాలు ఉన్నాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విశాఖ స్టీల్‌ను కాపాడతాం, ఆ శక్తి మాకే ఉందంటూ స్థానిక నేత నుంచి రాష్ట్ర స్థాయి నేతలంతా ఊదరగొట్టారు.

అసలేం జరిగింది? ఏం కొనసాగుతోంది ?

100 శాతం విశాఖ స్టీల్‌ను వ్యూహాత్మక సేల్ చేసి తీరుతామని మోడీ సర్కారు చేసిన ప్రకటనకు 2025 జనవరి 27తో నాలుగు సంవత్సరాలు దాటింది. 2025 ఫిబ్రవరి 12 నాటికి ప్రైవేటీకరణ వ్యతిరేక ఆందోళనలను కార్మికులు చేపట్టి నాలుగేళ్లు నిండాయి. సమస్య మాత్రం యథాతథంగానే ఉందన్నది ఎవ్వరూ కాదనలేనిది. సొంత గనులను కేటాయించలేదు. కాంట్రాక్టు కార్మికుల ఉపాధిపై కత్తి వేలాడుతూనే ఉంది. ఉద్యోగులు, కార్మికుల వేతనాల సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్‌ను విలీనం చేయాలని విశాఖ కార్మికవర్గమే కాదు రెండు తెలుగు రాష్ట్రాల సామాన్య ప్రజానీకం, మేధావులు కోరుతున్నా కేంద్రంలోని మోడీ సర్కారు కనీసం పట్టకుండా వ్యవహరిస్తోంది.



నమ్మించి గొంతు కోయడం కాదా!

రాష్ట్రంలోని కూటమి పాలకులైన తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్ర బిజెపికి వంతపాడుతూ వస్తున్న సంగతి కాదనలేని వాస్తవం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని ఎవరు చెప్పారంటూ కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకరేమిటి కూటమి పార్టీల్లోని నేతలంతా నమ్మబలుకుతూనే ఉన్నా మోడీ ద్వారా పార్లమెంట్‌లో లేదా పార్లమెంట్ బయటగానీ ప్రైవేటీకరణ చేయడం లేదన్న ప్రకటన చేయించడం లేదు. ప్యాకేజీ పేరుకే తప్ప నిజాయితీగా విశాఖ స్టీల్‌ను ప్రభుత్వరంగంలో నడపడానికి కాదన్నది తాజా పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల్లేనందున పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధ్యం కావడం లేదని, సెయిల్‌లో విలీనం చేయాలని కార్మికవర్గం కేంద్రం ముందు డిమాండ్ పెట్టినా సర్కారుకు పట్టడం లేదు. అనకాపల్లిలో ఏర్పాటు కాబోయే ఆర్సెల్లార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్ ఫ్యాక్టరీకి మాత్రం గనులు కొరత లేకుండా చెయ్యాలని 'కూటమి' నేతలు తెగ తాపత్రయ పడడం చూస్తే కమీషన్ల కక్కుర్తిలో త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కుకు ద్రోహం తలపెట్టడానికి వెనుకాడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చర్లపల్లి మీదుగా పలు రైళ్లు శాశ్వత మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్లను శాశ్వత ప్రాతిపదికన చర్లపల్లి వద్ద అదనపు స్టాప్‌లతో చర్లపల్లి -అమ్మగూడ - సనత్ నగర్ మీదుగా వయా చర్లపల్లి - మౌలాలీ జి.క్యాబిన్ -దయానంద్ నగర్ బైపాస్ క్యాబిన్ (బైపాస్ సికింద్రాబాద్)లో దారి మళ్లించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో 18520 లోకమాన్య తిలక్ టెర్మినల్ - విశాఖపట్నం రైలు ఏప్రిల్ 22 నుంచి, 18519 విశాఖపట్నం - లోకమాన్య తిలక్ టెర్మినల్ ఎక్స్‌ప్రెస్, 18503 విశాఖపట్నం-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 24 నుంచి, 20809 సంబల్పూర్-నాందేడ్ ట్రై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 18504 సాయినగర్ షిర్డీ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి, 20810 నాందేడ్-సంబల్పూర్ ఎక్స్‌ప్రెస్, 20811 విశాఖపట్నం-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుంచి, 20812 నాందేడ్ - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుంచి మళ్ళించిన మార్గంలో నడుస్తాయి. కావున ఈ రైళ్ల భవిష్యత్తులో సికింద్రాబాద్ మీదుగా ప్రయాణం చేయవు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అధికారులు కోరారు

లిహురి స్టేషన్‌లో
ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్టింగ్

వాల్తేరు డివిజన్‌లోని నౌపడ-గుణుపూర్ మార్గంలో ఉన్న లిహురి స్టేషన్ వద్ద మార్చి 15 నుంచి 23 వరకు జరిగే డోలో యాత్ర ఉత్సవం సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు లిహురి స్టేషన్‌లో రెండు నిమిషాల తాత్కాలిక హాల్ట్‌ను ఇవ్వనున్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

17న విశాఖకు సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) 56వ స్థాపన దినోత్సవం సందర్భంగా 'సురక్షిత తీరాలు, సమృద్ధి భారతదేశం' అనే థీమ్‌తో చేపట్టిన దేశవ్యాప్త సైక్లోథాన్ 17న విశాఖకు రానుంది. భారత తీర ప్రాంతాన్ని పూర్తిగా చుట్టేలా ఈ సైకిల్ యాత్రను రూపొందించారు. హోం శాఖ మంత్రి అమిత్ షా మార్చి 7న తమిళనాడులోని అరక్కోణం నుండి ఈ సైకిల్ ర్యాలీని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సైక్లోథాన్ సోమవారం విశాఖకు చేరుకుంటుందని విశాఖ పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాలీకి సంప్రదాయ స్వాగతం అందించేందుకు బీచ్ రోడ్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రత పట్ల అవగాహన కల్పించడం, ఉగ్రవాదం, మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు వంటి ముప్పులపై వారికి సూచనలు ఇవ్వడం ఈ సైక్లోథాన్ ప్రధాన లక్ష్యమన్నారు. 18వ తేదీన ప్రత్యేక సెండ్-ఆఫ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విపిటి చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, ప్రధాన అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు



పరీక్షా సామగ్రిని పంపిణీ చేస్తున్న శుభ తదితరులు

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులు 400 మందికి స్టేషనరీ, ఫ్లాంక్, పెన్ను పెన్సిల్, జామెట్రీ బాక్స్‌తో కూడిన కిట్లను బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కో కన్వీనర్ కాంగు శుభ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవి మంచి మార్కులు సాధించి, ఉన్నత చదువులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా బాలల లీగల్ అడ్వైజర్ నడిగట్ల నూకరాజు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన యర్రా యుగంధ కుమార్, జిల్లా బాలల హక్కుల కన్వీనర్ రెమెల గంగాధర్, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

రంగురాళ్ల తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం, దుప్పులపాలెం పరిసర ప్రాంతమైన తప్పసికొండ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలను ఆపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, ముర్ల పురుషోత్తం డిమాండ్ చేశారు. తప్పసికొండ ప్రాంతంలో అక్రమంగా రంగురాళ్ళ తావ్వకాల కోసం రాయిక్వారీలో బాంబులతో బ్లాస్టింగ్ చేశారనే వదంతుల నేపథ్యంలో శనివారం ఆ ప్రాంతాన్ని నూకరాజు, పురుషోత్తం సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నాళ్లుగా అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు సాగుతున్నా సంబంధిత అధికారులు మామూళ్ళ మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు బాంబులతో రాయిక్వారీని బ్లాస్టింగ్ చేశారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత కుట్టు మిషన్ పథకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : బిసి, ఓసి ఉప కులాల మహిళలు బీసీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే కుట్టు మిషన్ కోసం ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మారేడుమిల్లి పంచాయతీ కార్యదర్శి పి విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాలు వయస్సు గల మహిళలు రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కి లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో మారేడుమిల్లి గ్రామ సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వినియోగదారుల హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమం వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి జి.హరతి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్ మాట్లాడుతూ వినియోగదారుడికి నష్టం జరిగితే జిల్లా ఫోరంలో ఫిర్యాదు చేయాలని, జిల్లా కలెక్టర్ ప్రధాన న్యాయాధికారిగా ఉండి నష్టపరిహారం సమకూర్చుతారని తెలిపారు. కామర్స్ లెక్చరర్ జి.హరతి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ దేశాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యస్.అప్పనమ్మ, బి.శ్రీనివాసరావు, కె.శైలజ, డాక్టర్ వై.పద్మ, కె.శకుంతల, జి.సాయికుమార్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-అడ్డతీగల : ఈనెల 17వ తేదీ నుంచి జరుగు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలోని అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ, గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలల్లోనూ పరీక్షా కేంద్రాలు అన్ని మౌలిక వసతులతో ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ పి.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పరీక్షా కేంద్రాలను శనివారం ఎంఇఒ సందర్శించి వాటిల్లో ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. రెండు సెంటర్లలో మొత్తం 364 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తారని, రెండు సెంటర్లో 18 మంది ఇన్విజిలేటర్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు.